వైభవం.... తెప్పోత్సవం

కాణిపాకంలో ముగిసిన ప్రత్యేక ఉత్సవాలు


కాణిపాక ఆలయ ఆస్థానమండపంలో తలపై దీపంతో కుండపై నృత్యం చేస్తున్న కళాకారిణి


కాణిపాక ఆలయ పుష్కరిణిలో తెప్పపై ఊరేగుతున్న సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడికి మొక్కుతున్న మహిళలు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాల్లో మంగళవారం రాత్రి వరసిద్ధుడు పుష్కరిణిలో తెప్పలపై విహరిస్తూ భక్తజనులకు దర్శనమిచ్చారు.పుండరీక నాయుడు, ,శేషాద్రి నాయుడు, హనుమంత నాయుడు ,రామకృష్ణారెడ్డి,దామోదరనాయుడు, చల్లగుండ్ల దామోదరనాయుడు జ్ఞాపకార్థం వారివారి కుటుంబసభ్యులు,లంకిపల్లె మోహన్‌బాబు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం ఉభయదారుల ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు ఘనంగా అభిషేకం నిర్వహించారు. రాత్రి ఉభయ వరస రావడంతో అలంకార మండపంలో స్వామివారి ఉత్సవ మూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలను తెప్పలపై వుంచి ఆలయ పుష్కరిణిలో మూడుసార్లు ప్రదక్షిణలు చేయించారు.తెప్పలపై స్వామివారిని దర్శించుకొనేందుకు వేలాదిగా భక్తులు తరలి వచ్చారు.అనంతరం ఉత్సవ విగ్రహాలను కాణిపాక పుర వీధుల్లో ఊరేగించారు.ఈ గ్రామోత్సవానికి పెద్దఎత్తునే భక్తులు విచ్చేశారు. దీంతో కాణిపాకంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాలు ముగిశాయి.ఈవో పెంచలకిషోర్,ఈఈ వెంకట నారాయణ, ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్‌గురుకుల్,ఏఈవోలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు,సూపరింటెండెంట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు,చిట్టిబాబు పాల్గొన్నారు.

అందరి సహకారంతో బ్రహ్మోత్సవాలు విజయవంతం: ఉభయదారులు, పరిసర గ్రామస్థులు, భక్తుల సహకారంతో కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలు విజయవంతమయ్యాయని ఈవో పెంచల కిషోర్ అభిప్రాయపడ్డారు.ఇందుకు సహకరించిన ఎమ్మెల్యే మురళీమోహన్‌తో పాటు అన్ని శాఖల అధికారులకు,సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. భక్తులకు కాలక్షేపం కోసం ఆస్థాన మండపంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయన్నారు. ఈసారి బ్రహ్మోత్సవాలకు భక్తుల సంఖ్య బాగా పెరిగిందన్నారు.

వారం రోజుల్లో రంగంలోకి కుంకీలు

మదపుటేనుగుల కట్టడిపై సబ్ డీఎఫ్‌వో



పలమనేరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మదపుటేనుగులను కట్టడి చేసేందుకు తీసుకొచ్చిన కుంకీ ఏనుగులను వారం రోజుల్లో రంగంలోకి దించనున్నట్లు పలమనేరు అటవీశాఖ సబ్ డివిజన్ అధికారి సి. వేణుగోపాల్ తెలిపారు.కర్ణాటక నుంచి తీసుకొచ్చిన కుంకీలను అవసరమైన ప్రాంతాలకు తరలించేందుకు ఎలిఫెంట్ క్యాంపు వద్ద ప్రత్యేక వాహనాలను సమకూర్చు కోవడంలో కొంత ఆలస్యం జరిగిందన్నారు.వాహనాలు తెప్పించామని,కల్లూరు, పులిచెర్ల, సోమల ప్రాంతాల్లో పంటలను నాశనం చేస్తున్న ఏనుగులను కుంకీల ద్వారా కట్టడి చేసే పనులు వారం రోజుల్లో ప్రారంభమవుతాయన్నారు.రైతులు పండించిన పంటలను నాశనం చేయడంతో పాటు అప్పుడప్పుడూ జనాన్ని సైతం చంపేస్తున్న గజరాజుల ఆట కట్టించేందుకు కర్ణాటక నుంచి మే నెలలో తీసుకొచ్చిన 4 కుంకీ ఏనుగులను పలమనేరు సమీపంలోని ముసలిమడుగు వద్ద సిద్ధం చేసిన ఎలిఫెంట్ క్యాంపులో వుంచిన విషయం తెలిసిందే.కుంకీల సాయంతో ఆ ఏనుగులను అటవీలోతట్టుప్రాంతాలకు తరిమివేయడంతో పాటు మదగజాలను కుంకీల సాయంతో ఎలిఫెంట్ క్యాంప్‌కు తీసుకొచ్చి బంధించేందుకు క్రాల్స్ కూడా సిద్ధం చేశారు. అయితే ఇప్పటి వరకు ఒక్కసారి మాత్రమే కుంకీ ఏనుగులను ఎలిఫెంట్ క్యాంపు నుంచి వెలుపలికి తీసుకొచ్చారు. బంగారుపాళ్యం అటవీప్రాంతం నుంచి పంటపొలాల వైపు వచ్చి దాడులకు తెగబడుతున్న ఒంటరి ఏనుగును అటవీ ప్రాంతంలోకి తరిమేందుకు ఉపయోగించారు.



మరుగుదొడ్ల నిర్మాణాల్లో వెనకబడ్డారు

కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు


సదస్సులో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్ డూడి

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత మరుగుదొడ్లు, కమ్యూనిటీ మరుగుదొడ్ల నిర్మాణాల్లో చిత్తూరు జిల్లా వెనకబడిందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు.అమరావతిలోని వెలగపూడి సచివాలయంలో సోమవారం ప్రారంభమైన కలెక్టర్ల సదస్సు మంగళవారం ముగిసింది.మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు ఎస్పీ తుషార్ డూడి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛభారత్, సర్క్యులర్ ఎకానమిపై జరిగిన చర్చలో సీఎం మాట్లాడుతూ మరుగుదొడ్ల నిర్మాణాల్లో చిత్తూరుతో పాటు కడప, నెల్లూరు, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాలు వెనుకబడి ఉన్నట్లు చెప్పారు. మెరుగుదల సాధించాలని కలెక్టర్లకు సూచించారు. అలాగే 30శాతానికి నేరాల శాతాన్ని తగ్గించే లక్ష్యంతో కలెక్టర్, ఎస్పీలు పనిచేయాలని ఆదేశించారు. సర్క్యులర్ ఎకానమీలో పోలీసు యంత్రాంగం కూడా భాగస్వామి కావాలన్నారు. శాంతిభద్రతలు పటిష్ఠంగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయని చెప్పారు.

టీటీడీ ఈవోకు ధర్మకర్తల మండలి అభినందన



టీటీడీ ఈవోగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన అనిల్‌కుమార్ సింఘాల్‌కు టీటీడీ ధర్మకర్తల మండలి ఛైర్మన్ బీఆర్ నాయుడు, సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. తిరుమలలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో పాల్గొన్న ఈవో సింఘాల్‌ను బోర్డు స్వాగతించింది. అన్ని విధాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చింది. గతంతో ఈవోగా పనిచేసిన అనిల్‌కుమార్ సింఘాల్‌కున్న అనుభవం భక్తులకు మెరుగైన సేవలు అందించడంలో, టీటీడీని అభివృద్ధి దిశగా నడిపించడంతో ఉపయోగపడుతుందని బోర్డు సభ్యులు అభిప్రాయపడ్డారు. మరోసారి ఈవోగా అవకాశం ఇచ్చిన సీఎంకు సింఘాల్ కృతజ్ఞతలు తెలిపారు. బోర్డు సలహాలు, సహకారంతో భక్తులకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తానన్నారు. అంతకు ముందు ఛైర్మన్, బోర్డు సభ్యుడు శాంతారాం ఈవోను సత్కరించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షుడిగా విజయభాస్కరరావు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షుడిగా ఎస్వీయూ ఫిజిక్స్ విభాగ ప్రొఫెసర్ ఎస్.విజయభాస్కరరావు నియమితులయ్యారు. ఎస్వీయూలోనే పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేసి, 1992 లో ఫిజిక్స్ అధ్యాపకుడిగా చేరారు. ఫిజిక్స్ విభాగాధిపతిగా, ఎస్వీయూ రీసెర్చ్ డీన్‌గా, విక్రమసింహపురి యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా వ్యవహరించారు. ఈయన పర్యవేక్షణలో 30 పీహెచ్‌డీలు, 10 రీసెర్చ్ ప్రాజెక్టులు పూర్తయ్యాయి. సుమారు 200 పరిశోధనా వ్యాసాలు రూపొందించారు. 104వ ఇస్కా కార్యదర్శిగా సేవలందించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడిగా బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.


శ్రీవారి సర్వదర్శనానికి 12గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తుతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.13 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,066

తలనీలాలు సమర్పించినవారు: 24,620



సారీ.. శనేశ్వరా..!

- శని భగవానుడినీ వదలని రాజకీయ గ్రహణం
- అది విష్ణుమూర్తి అంటూ కరుణ దుష్ప్రచారం
- అభయ శనేశ్వరుడని చెప్పినా వినిపించుకోని వైనం



విగ్రహం వద్ద కరుణాకరరెడ్డి

తిరుపతి/తిరుమల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం శ్రీ వేంకటేశ్వర శిల్పకళాశాల సమీపంలో రెండు దశాబ్దాల కిందటి నుంచి పడున్న ఓ అసంపూర్తి శనేశ్వర విగ్రహానికి వైసీపీ రాజకీయరంగు పులిమింది. టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి హఠాత్తుగా మంగళవారం ఆ విగ్రహం వద్దకు చేరుకున్నారు. పాదపీటికకు మొక్కి కళ్లకద్దుకున్నారు. కొబ్బరికాయ కొట్టి కోనేటిరాయుడా.. ఏమిటీ నీకీ దుస్థితి? హైందవ ధర్మానికి తూట్లు పొడుస్తున్నారని అంటూ ఆవేదనచెందారు. విగ్రహం పడేసిన చోట మూత్ర విసర్జన చేస్తున్నారని, మద్యం తాగుతున్నారని ఆరోపించారు. విష్ణుమూర్తికి జరిగిన అపచారానికి హిందూ సంఘాలన్నీ ఏకంకావాలంటూ పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచీ ఘోరాలు జరిగిపోతున్నాయని ధ్వజమెత్తారు. దీనిపై సోషల్ మీడియాలో ఫొటోలు పోస్ట్ చేశారు. ఈ విషయం తెలిసి టీడీపీ నాయకులు వాస్తవాలను ప్రజలకు చెప్పాలని ఘటనా స్థలికి వెళ్లారు. అది విష్ణుమూర్తి కాదని, అభయ శనేశ్వర విగ్రహమని రుజువు చేశారు. రెండు దశాబ్దాలుగా అక్కడుందని అన్నారు. అయినా, కరుణాకర్‌రెడ్డి మాత్రం సవరించుకోలేదు. వైఖానస ఆగమశాస్త్రం తెలియని వాళ్లు తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని, అది ముమ్మాటికీ విష్ణుమూర్తి రూపమేనని పునరుద్ఘాటించారు. మరోవైపు, మధ్యాహ్నం తిరుమలలో టీటీడీ పాలకమండలి సమావేశంలో ఈ అంశం ప్రస్తావనకు రావడంతో సభ్యులు తీవ్రంగా స్పందించారు. టీటీడీపై తప్పుడు ప్రచారాలు చేసే వారిపై క్రిమినల్ కేసులు పెడతామని, జైలుకు పంపిస్తామని ఛైర్మన్ బీఆర్ నాయుడు, సభ్యులు హెచ్చరించారు.

శనేశ్వరుడినీ వదలవా?: టీడీపీ

రెండు సార్లు ఎమ్మెల్యేగా, టీటీడీ ఛైర్మన్‌గా పనిచేసిన వ్యక్తికి ఎప్పటినుంచో పడున్న అసంపూర్తి శనేశ్వర విగ్రహం గురించి తెలియదా అని టీడీపీ నేతలు ప్రశ్నించారు. యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, శాప్ ఛైర్మన్ రవినాయుడు, గంగమ్మ ఆలయ ఛైర్మన్ మహేష్ యాదవ్, సీనియర్ నాయకులు ఊకా విజయకుమర్, జేబీ శ్రీనివాస్ తదితరులు ఈ విగ్రహాన్ని పరిశీలించి మీడియాతో మాట్లాడారు. నాస్తికుడైన కరుణాకర్‌రెడ్డి పదే పదే టీటీడీపై దుష్ప్రచారం చేయడం తగదన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేందుకు తప్పుడు ప్రచారాలు చేస్తే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కుటుంబసమేతంగా కొండకు వెళ్లి తలనీలాలు ఇచ్చి, స్వామిని వేడుకుంటే తప్ప మీపాపం పోదని మండిపడ్డారు.



విగ్రహాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

ఆర్డర్ ఇచ్చిన వ్యక్తి చనిపోవడంతో ఆ విగ్రహాన్ని వదిలేశాం



మీడియాతో మాట్లాడుతున్న గురుస్వామి

ఈ ఆరోపణల నేపథ్యంలో విగ్రహాన్ని తయారు చేసిన కన్నయ్యచారి కుమారుడు గురుస్వామి తిరుమల చేరుకున్నారు. టీటీడీ బోర్డుకు వివరాలు వెల్లడించారు. మీడియాతోనూ మాట్లాడారు. 'దాదాపు 22 ఏళ్ల కిందట మాకు రాయలచెరువు రోడ్డులో విగ్రహాల తయారీ షెడ్డు ఉండేది. ఆ సమయంలో బెంగళూరుకు చెందిన వ్యక్తి శనీశ్వరుడు విగ్రహం కావాలని రూ.2 లక్షలు, డ్రాయింగ్ ఇచ్చారు. పది చేతులు, కాకికి బదులుగా సింహం పెట్టాలని కోరాడు. తర్వాత ఆ వ్యక్తి చనిపోయాడు. మా పరిస్థితి కూడా బాగాలేకపోవడంతో అక్కడి స్థలాన్ని విక్రయించి అన్ని విగ్రహాలతో అలిపిరిలోని శిల్ప క్వార్టర్స్‌కు వెళ్లాం. 2003లో అలిపిరిలో చంద్రబాబుపై జరిగిన క్లైమోర్‌మైన్ పేలుడుతో మమ్మల్ని అక్కడ్నుంచి ఖాళీ చేయించారు. ఆ సమయంలో చిన్నచిన్న విగ్రహాలు తీసుకున్నామే తప్ప, ఈ భారీ శనీశ్వరుడి విగ్రహాన్ని అక్కడే వదిలేశాం. 22 ఏళ్లుగా ఈ విగ్రహం అక్కడే ఉంది. చాలాసార్లు తరలించే ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదు' అని స్పష్టతనిచ్చారు.

శనీశ్వరుడికి, మహావిష్ణువుకు తేడా తేలీదా?

- టీటీడీ సభ్యుల ఆగ్రహం

శనీశ్వరుడికి, మహావిష్ణువు తేడా తెలియదా అంటూ భూమనను టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ప్రశ్నించారు. 'ఓ రాజకీయ నిరుద్యోగి. పాత చెప్పు ఇవ్వండి ఆ నల్లరాయిని కొడతా అన్న వ్యక్తి. టీటీడీ ఛైర్మన్‌గా, బోర్డు సభ్యుడిగా పనిచేసిన కరుణాకరరెడ్డి అబద్ధాలకు కేరాఫ్ అడ్రెస్‌గా మారారు' అని ఆగ్రహించారు. తిరుమలలోని ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో రెండుసార్లు భూమన టీటీడీ ఛైర్మన్‌గా ఉన్నప్పుడూ ఈ విగ్రహం అక్కడే ఉందన్నారు. అప్పుడు పూజలు చేయకుండా ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. ఆయనే ఈ విగ్రహం సమీపంలో మద్యం బాటిళ్లు, పొగాకు ఉత్పత్తుల ప్యాకెట్లు వేయించినట్టు అనుమానాలున్నాయన్నారు. హిందూ వ్యతిరేక ప్రభుత్వంగా చిత్రీకరించేందుకు కరుణాకరరెడ్డి ముందస్తు ప్రణాళికతోనే ఈ ఆరోపణలు చేశారన్నారు. 'నువ్వు ఇంట్లో ఆచరించే మతవిశ్వాసాలు వేరు. ఉనికి కోసం బయట ఆచరించే మతం వేరు. కేవలం ధనార్జన కోసం టీటీడీని, శ్రీవారిని ఉపయోగించుకున్న భక్తిలేని వ్యక్తివి' అంటూ మరో సభ్యుడు ఎంఎస్ రాజు మండిపడ్డారు. కరుణాకరరెడ్డి రోజురోజుకు దిగజారిపోయి మాట్లాడుతున్నారంటూ డాలర్స్ దివాకర్‌రెడ్డి విమర్శించారు. విష్ణుమూర్తికి మీసాలు ఉండవనే విషయాన్ని భూమన గ్రహించాలని పనబాక లక్ష్మి సూచించారు.

భూమనపై కేసు నమోదు

కాగా,టీటీడీపై దుష్ప్రచారం చేస్తూ హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్నారంటూ టీటీడీ డీఈఈ గోవిందరాజులు వైసీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డిపై అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రజలను తప్పుదారి పట్టించడం ద్వారా సమాజంలో అల్లకల్లోలం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు భూమనపై పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. కాగా, టీటీడీ ఫిర్యాదు నేపథ్యంలో భూమన మరో వీడియోను విడుదల చేశారు. శనీశ్వరుడి విగ్రహానికి శంకుచక్రాలు ఎందుకుంటాయని ప్రశ్నించారు. ఒకవేళ శనీశ్వరుడి విగ్రహం అనుకున్నా దేవుడే కదా? ఎవరో తెచ్చి పడేస్తే తీసివేయాల్సిన బాధ్యత టీటీడీకి లేదా? అని ప్రశ్నించారు. తనకు జైలు కొత్తకాదని స్పష్టం చేశారు.

రైల్వే బ్రిడ్జి గడ్డర్ల మార్పు పనుల్లో తీవ్ర జాప్యం

- గంటల తరబడి ఆలస్యంగా నడిచిన రైళ్లు
- అర్ధాంతరంగా పలు లోకల్ రైళ్ల రద్దు



గడ్డర్ల మార్పు పనులు చేస్తున్న రైల్వే సిబ్బంది

తడ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): రైల్వే బ్రిడ్జి గడ్డర్ల మార్పు పనుల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకోవడంతో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు గంటల కొద్దీ ఆలస్యంగా నడవగా, మరికొన్ని రైళ్లను అర్ధాంతరంగా రద్దు చేశారు. చెన్నై - గూడూరు మార్గంలోని తడ - సూళ్లూరుపేట స్టేషన్ల మధ్య కాళంగి నదిపై ఉన్న బ్రిడ్జికి ఇనుప గడ్డర్ల స్థానంలో సిమెంట్ గడ్డర్ల ఏర్పాటు చేయాలని సదరన్ రైల్వే అధికారులు నిర్ణయించారు. సోమవారం అర్ధరాత్రి 1.10నుంచి మంగళవారం ఉదయం 9.10 వరకు పనులు చేసేందుకు సన్నద్ధమయ్యారు. ఈ మేరకు పలు రైళ్లను పూర్తిగా, మరికొన్ని రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు.సోమవారం అర్ధరాత్రి మొదలైన పనులను ఉదయం 9.10కి పూర్తి చేయాల్సి ఉండగా, మధ్యాహ్నం 2గంటల వరకు కొనసాగించారు. దీంతో చెన్నై - విజయవాడ మధ్య నడిచే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు గంటల కొద్దీ ఆలస్యంగా నడిచాయి. అలాగే చెన్నై - సూళ్లూరుపేట మధ్య నడిచే లోకల్ రైళ్లు చెన్నై - ఎలావూరు మధ్య నడిచాయి. చెన్నై సెంట్రల్ నుంచి లక్నో వెళ్లే లక్నో ఎక్స్‌ప్రెస్, విజయవాడ నుంచి చెన్నైకు వెళ్లే పినాకిని ఎక్స్‌ప్రెస్, చెన్నై నుంచి అహ్మదాబాద్ వెళ్లే నవజీవన్ ఎక్స్‌ప్రెస్ 3 గంటలు ఆలస్యంగా నడిచాయి. అలాగే చెన్నై సెంట్రల్ నుంచి విశాఖపట్నం వెళ్లే ప్రత్యేక రైలు 2.40 నిమిషాలు ఆలస్యం కాగా, సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు ఉదయం 10 గంటలకు బయలుదేరి వెళ్లే మెమూ రైలు 2 గంటలు ఆలస్యంగా వెళ్లింది. మరికొన్ని సూపర్‌ఫాస్ట్ రైళ్లు తడ, ఎలావూరు, గుమ్మిడిపూడి, పోలిరెడ్డిపాళెం, దొరవారిసత్రం, నాయుడుపేట, పెద్దపరియ స్టేషన్లలో గంటల కొద్ది నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



నాయుడుపేటలో ఆగిఉన్న పినాకిని ఎక్స్‌ప్రెస్

శ్రీవారి ఆలయ శుద్ధి

తిరుమల, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ఆలయ శుద్ధి జరిగింది. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముందు వచ్చే మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఆనంద నిలయం నుంచి బంగారు వాకిలి, ఉప ఆలయాలు, ప్రసాదాల పోటు, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పుతో పాటు పూజా సామగ్రిని శుద్ధి చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పూజాసామగ్రి తీసుకొస్తున్న టీటీడీ ఛైర్మన్, ఈవో తదితరులు

అడవిలో మృతులు తమిళనాడువాసులు

- తాజాగా గోతిలో కనిపించిన ఇద్దరు చిన్నారుల శవాలు
- భార్య, పిల్లల మృతదేహాలను గుర్తించిన భర్త
- నలుగురినీ ఎవరో హత్య చేసినట్లు అనుమానం?





కలై సెల్వన్ - జయమాల (ఫైల్‌ఫొటోలు)



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చంద్రగిరి/ పాకాల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పాకాల వారిపల్లె అటవీ ప్రాంతంలో మంగళవారం బయటపడిన మృతదేహాలు తమిళనాడుకు చెందిన వారివిగా నిర్ధారణ అయింది. ఆదివారం సాయంత్రం ఈ అడవిలో ఓ పురుషుడు శవం చెట్టుకు వేలాడుతుండటం, ఓ మహిళ మృతదేహం సమీపాన పడి ఉండటం, అక్కడే పూడ్చిపెట్టిన రెండు గోతులను పోలీసులు గుర్తించిన సంగతి తెలిసిందే. గోతుల్లో ఇద్దరు చిన్నారులను పూడ్చిపెట్టి ఉంటారని పోలీసులు భావించారు. సోమవారం పురుషుడు, మహిళల శవాల పోస్టుమార్టం, ఖనన ప్రక్రియతో చీకటి పడిపోయింది. ఈక్రమంలో మంగళవారం పోలీసులు అడవికి చేరుకుని రెండు గోతులను కొంతమేర తవ్వారు. గోతిలో మొబైల్ ఫోన్, డెయిరీ మిల్క్ చాక్లెట్, పాన్ కార్డు, ఆధార్ కార్డు, నగదుతో పాటు చిన్నారుల మృతదేహాలున్నట్లు గుర్తించారు. సాయంత్రం కావడంతో గోతులను పూర్తిగా తవ్వలేకపోయారు. ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో బుధవారం ఉదయం పూర్తిగా తవ్వి, మృతదేహాలను వెలికి తీయనున్నట్లు పోలీసులు తెలిపారు.

మందుల చీటీనే క్లూ

రెండు రోజుల క్రితం సంఘటనా స్థలం వద్ద మందుల చీటీ పాకాల పోలీసులకు దొరికింది. ఈ క్లూ ఆధారంగా వారు దర్యాప్తు చేపట్టారు. ఆ ప్రిస్క్రిప్షన్ తమిళనాడులోని తంజావూరు వైద్యుడు రాసిందిగా గుర్తించి అక్కడి పోలీసులకు సమాచారమిచ్చారు. వారు సదరు వైద్యుడ్ని ఆరా తీశారు. కలై సెల్వన్ అనే వ్యక్తి మానసిక స్థితి సరిగా లేక తన దగ్గర వైద్యం పొందుతున్నాడని ఆ వైద్యుడు తెలిపారు. ఈఏడాది జూలైలో తిట్టచ్చేరి పోలీస్ స్టేషన్‌లో పరిధిలోని వెంకటేశ్ అనే వ్యక్తి తన భార్య జయమాల, కుమార్తెలు హర్షిణి(7), దర్శిణి(3) కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇతడు కుటుంబ పోషణ కోసం కువైట్‌లో ఉండేవాడు. అడవిలో శవాల సమాచారంతో అతడ్ని తమిళనాడు పోలీసులు మంగళవారం తీసుకొచ్చారు. సంఘటనా స్థలంలో ఉన్నది తన భార్య జయమాల మృతదేహమని వెంకటేష్ గుర్తించారు. మరో మృతుడు తన సమీప బంధువు కలైసెల్వన్(37)గా పేర్కొన్నారు. దీంతో మృతులెవరనేది నిర్ధారణ అయింది. మృతులకు నోట్లో గుడ్డలు కుక్కి, పార్శిల్ టేప్ చుట్టినట్లు ఉండటంతో పోలీసులు హత్యగానే భావిస్తున్నారు. లోతైన దర్యాప్తులో వీరి మృతికి సంబంధించి మిస్టరీ వీడుతుందని చెబుతున్నారు.

మళ్లీ బాంబు బెదిరింపు మెయిల్స్

- ఈసారి లిటిల్ ఏంజెల్స్ స్కూల్‌కు..
- ఫేక్ మెయిల్‌గా తేల్చిన బీడీ టీమ్



లిటిల్ ఏంజెల్స్ స్కూలులో తనిఖీలు చేస్తున్న పోలీసులు, బాంబు స్క్వాడ్ సిబ్బంది

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మీ హోటళ్లలో బాంబులు పెట్టాం.. పేల్చేస్తామంటూ గతేడాది అక్టోబరు 24న మొదలైన బెదిరింపు ఈ మెయిల్స్ ఇప్పటికీ కొనసాగుతున్నాయి. తాజాగా తిరుపతి నగరం రైల్వే కాలనీలోని లిటిల్ ఏంజెల్స్ స్కూల్‌కు ఆ తరహా మెయిల్ వచ్చింది. ఈ స్కూల్‌లో బాంబులు పెట్టామని త్వరలో పేలతాయంటూ మంగళవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో తమిళనాడు నుంచి రజాక్ హాట్ మెయిల్ నుంచి స్కూల్ మెయిల్‌కి సందేశం పంపారు. దీనిపై పాఠశాల కరస్పాండెంట్ అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ భక్తవత్సలం పర్యవేక్షణలో అలిపిరి సీఐ రాంకిషోర్, ఎస్ఐ అజిత, బాంబు డిస్పోజల్ స్క్వాడ్ సిబ్బంది ఘటనా స్థలికి వెళ్లి బాంబు డిస్పోజల్ పరికరాలతో పాఠశాలతో పాటు ప్రిన్సిపాల్ చాంబర్, తరగతి గదులు, ప్రాంగణమంతా తనిఖీలు చేశారు. డాగ్ స్క్వాడ్ సిబ్బందీ పరిశీలించారు. దాదాపు గంట పాటు జరిగిన తనిఖీల్లో ఎలాంటి బాంబులు లేవని, ఫేక్ మెయిల్‌గా తేల్చారు. దీనిపై అలిపిరి సీఐ కేసు నమోదు చేశారు.కాగా, 11నెలల కిందట తొలుత నాలుగు హోటళ్లకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ఆ తర్వాత అక్టోబరు 27న ఇస్కాన్ టెంపుల్‌కు, మరో ఐదు హోటళ్లకూ.. డిసెంబరు 13న వ్యవసాయ కళాశాలకు.. ఈ ఏడాది మార్చి 21న కలెక్టరేట్‌కు.. మే 28న మళ్లీ కలెక్టరేట్‌కు.. వ్యవసాయ కళాశాలకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. కొంతకాలం ఆగాక.. మళ్లీ బాంబు మెయిల్ వచ్చింది.

డిజిటల్ మారథాన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్,సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్ర యువ సంకల్ప్ 2కె25 రాయబారి డిజిటల్ మారథాన్'కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్ తెలిపారు. వికసిత్ భారత్‌లో భాగంగా సామాజిక బాధ్యత, కుటుంబ సంబంధాలు, ఆరోగ్యకరమైన జీవనం, బాధ్యతాయుత డిజిటల్ ఆవిష్కరణల ప్రోత్సాహానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. 18-35 ఏళ్ల మధ్య వయస్కులు తాము చేపట్టిన కార్యక్రమాలపై 120సెకన్ల నిడివి గల వీడియోలను సొంత సామాజిక మాధ్యమాల్లో చూపించి అధికారిక హాష్‌టాగ్‌లతో పోస్టు చేయాలన్నారు. ఉత్తమమైన మూడింటిని ఎంపికచేసి రూ.లక్ష, రూ.75వేలు, రూ.50వేల బహుమతి ఇస్తారన్నారు. 9మంది విజేతలకు ఆంధ్ర యువత బ్రాండ్ అంబాసిడర్ గా సత్కరిస్తారు. ఆసక్తి గల వారు 'ఆంధ్రయువసంకల్ప్.కామ్' వెబ్‌సైట్‌లో పేర్లను రిజస్టర్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9848543976 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.






మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యేలు పులివర్తి నాని, భానుప్రకాష్ - సుబ్రమణ్యం నాయుడు (ఫైల్ ఫొటో)

డీసీఎంఎస్ ఛైర్మన్ కన్నుమూత

- ఎమ్మెల్యేలు, టీడీపీ శ్రేణుల నివాళులు

చంద్రగిరి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీ గడ్డంవారిపల్లెకు చెందిన డీసీఎంఎస్ ఛైర్మన్ పల్లినేని సుబ్రమణ్యంనాయుడు మంగళవారం ఉదయం మృతి చెందారు. కొన్ని రోజులుగా శ్వాసకోశ వ్యాధితో ఇబ్బంది పడుతున్న ఆయన చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అసువులు బాశారు. ఈయన మృతదేహాన్ని ఎమ్మెల్యే పులివర్తి నాని దగ్గరుండి చెన్నై నుంచి స్వగ్రామానికి తీసుకొచ్చారు. మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరం జంక్షన్‌కు మృతదేహం చేరుకుంది. అక్కడ్నుంచి మండలంలోని నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ ద్వారా చంద్రగిరి మీదుగా గడ్డంవారిపల్లెకు మృతదేహాన్ని తీసుకెళ్లారు. ఈయన గతంలో రెండు పర్యాయాలు మండల పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఐతేపల్లె సింగిల్‌విండో ఛైర్మన్‌గా పనిచేసి, ప్రస్తుతం డీసీఎంఎస్ ఛైర్మన్‌గా ఉన్నారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కార్యకర్తలకు అండగా ఉన్నారు. పార్టీ విజయానికి కృషి చేశారు. ఈయన మృతి పార్టీకి తీరనిలోటని నేతలు పేర్కొన్నారు. చంద్రగిరి, నగరి ఎమ్మెల్యేలు పులివర్తి నాని, భానుప్రకాష్, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి హేమాంబరధరరావు, నేతలు కుమారరాజారెడ్డి, ముడిపల్లె సురేష్‌రెడ్డి, పారిశ్రామికవేత్త ఏవీ రమణమూర్తి, ఈశ్వర్‌రెడ్డి, శుభగిరి, శ్రీధర్‌నాయుడు, అనిమిని మధు, దేవానందనాయుడు తదితరుల నివాళులర్పించారు.

జలజల జాలువారంగ..!





తిరుపతిలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో శేషాచల కొండల్లో నుంచి మాల్వాడిగుండం ప్రవహించింది. కపిలతీర్థంలోకి జలజలమంటూ జలపాతం దూకుతూ కనువిందు చేసింది.

డీఎస్సీ ఫలితాల్లో మెరిసిన మాణిక్యాలు

చిత్తూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాల్లో ఓ ప్రభుత్వ ఉద్యోగం ఆ కుటుంబంతో పాటు కొన్ని తరాల భవిష్యత్తును మారుస్తుంది.తాజా డీఎస్సీ ఫలితాల్లో 1408మంది పలు విభాగాల్లో టీచర్ ఉద్యోగాలను పొందారు. వారిలో 20 ఏళ్లుగా కష్టపడుతున్నవారు కొందరైతే, ఇంట్లో పిల్లల్ని చూసుకుంటూ ఉద్యోగం పొందినవారు మరికొందరు, కడు పేదరికాన్ని అనుభవిస్తూ విజయం సాధించినవారు ఇంకొందరు.అనేక రకాల ప్రతికూల పరిస్థితుల్లోనూ కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. ఈ నెల 19న అమరావతిలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా నియామక పత్రాల్ని అందుకోనున్న వీరిలో కొందరు విజేతల అభిప్రాయాలివి.



మా ఊర్లో తొలి ప్రభుత్వ ఉద్యోగిని నేనే

మాది బంగారుపాళ్యం మండలంలోని మారుమూల ప్రాంతమైన కొదలమడుగు.మావారు కదిరివేల్ తాపీమేస్త్రీగా పనిచేస్తూ నన్ను చదివించారు. మాకు ఇద్దరు పిల్లలు. నేను ఏ కోచింగ్ సెంటర్‌కూ వెళ్లలేదు.నా విజయం వెనుక మా అమ్మానాన్న ప్రోత్సాహంతో పాటు నా భర్త కష్టం వుంది. మా గ్రామంలో మొదటి ప్రభుత్వ ఉద్యోగిని నేనే. అందుకే గ్రామస్థులంతా కలిసి సన్మానించారు.

- మీనా, టీజీటీ, మ్యాథ్స్ ఇంగ్లీష్ మీడియం

నాన్న కల నెరవేర్చా



మేం నలుగురం అమ్మాయిలం. నేను చివరిదాన్ని. డీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న సమయంలో నాన్న చనిపోయారు. ఆ బాధతోనే పరీక్షలకు హాజరయ్యా. నాన్న కోరుకున్న ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించి ఆయన కలను నెరవేర్చడం ఎంతో ఆనందంగా ఉంది. తాజా డీఎస్సీలో ఎస్జీటీ ఉద్యోగం వచ్చింది. ఇక నా కూతురు భవిష్యత్తు కూడా బాగుంటుంది. నా భర్త లోకేశ్, కుటుంబ సభ్యుల మద్దతు లేకుంటే ఈ విజయం సాధ్యమయ్యేది కాదు.

- హేమమాలిని, మార్లబండ, యాదమరి మండలం

ముగ్గురు అమ్మాయిలమూ ఉద్యోగులమే



మాది నింద్ర మండలం కావనూరు గ్రామం. తల్లిదండ్రులు అంకమ్మ, సుబ్రమణ్యం. మేం ముగ్గురం అక్కాచెల్లెళ్లు. ఆడపిల్లలని చిన్నచూపు చూడకుండా అందరినీ కూలి పనులు చేసి పీజీ వరకు చదివించారు. మా అక్క సచివాలయ ఉద్యోగి. మా చెల్లి టీటీడీలో ఉద్యోగి. నేను తాజా డీఎస్సీలో ఎస్జీటీ ఉద్యోగం సాధించా. మా తల్లిదండ్రుల కష్టం మేం ఉద్యోగాలు సాధించడంతో తీరిపోయింది.

- ఊహ, ఎస్జీటీ, నింద్ర

అన్న క్యాంటీన్‌లో తింటూ మూడు ఉద్యోగాలు



2005 నుంచి డీఎస్సీ పరీక్షలు రాస్తున్నా. ప్రతిసారీ అవకాశం దగ్గరికి వచ్చి చేజారిపోతోంది. ఈసారి తిరుపతిలోనే ఉంటూ, అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తూ డీఎస్సీకి సన్నద్ధమయ్యా. వెంకటేశ్వరస్వామి దయతో 43 ఏళ్ల వయసులో ఏకంగా మూడు ఉద్యోగాలకు అర్హత సాధించడం సంతోషాన్నిచ్చింది. తెలుగు స్కూల్ అసిస్టెంట్, పీజీటీలో రెండు ఉద్యోగాలు వచ్చాయి.

-ప్రకాష్, ఉప్పిలిపల్లె దళితవాడ, పెనుమూరు మండలం

ఇక అమ్మను కూలి పనులకు పంపను



మాది ఎస్ఆర్‌పురం మండలంలోని కొత్తపల్లిమిట్ట. నాన్న ఏసుపాదం రెండేళ్ల కిందట చనిపోయారు. అప్పటివరకు తిరుపతిలో అద్దె రూమ్‌లో వుంటూ డీఎస్సీకి ప్రిపేర్ అయిన నేను ఇంటికి వచ్చేసి ప్రిపేరయ్యా. అమ్మ మనియమ్మ రోజూ కూలికి వెళ్లి ఇంటి నిర్వహణ చూసుకునేది. చిన్నపాటి మా ఇంటికి పూతపని కూడా చేసుకోలేని దుర్భర స్థితిలో ఉన్నాం. ఉద్యోగం రావడంతో ఇక అమ్మను కూలి పనులకు పంపకుండా బాగా చూసుకుంటా.

-ప్రభుకుమార్, ఎస్జీటీ

నేటినుంచి పాఠశాలల్లో స్వచ్ఛతా పక్వాడా

● పక్షం రోజుల పాటు కార్యక్రమాలు

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల్లో బుధవారం నుంచి పక్షం రోజుల పాటు స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణ తెలిపారు. తొలి రోజున పాఠశాలలో స్వచ్ఛత శపథం, పాఠశాల పరిసరాలను శుభ్రపరచడంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొనాలి. 17న నీటి, పారిశుధ్య సదుపాయాలు తనిఖీ చేసి, మరమ్మతుల కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలి. 18న చేతులు శుభ్రపరచుకోవడం, హైజీన్, నీటి సంరక్షణ, వర్షపు నీటి సేకరణపై అవగాహన కల్పించాలి. 19న పాఠశాల తరగతి గదుల శుభ్రత, 20న స్వచ్ఛత, హైజీన్‌పై వ్యాసరచన, నినాదాలు, కవితా రచన పోటీలు నిర్వహించాలి. 21న పాఠశాల గోడలపై స్వచ్ఛ భారత్ సందేశాల పెయింటింగ్స్, 22న పర్యావరణం, శుభ్రత, నీటి సంరక్షణ అంశాలపై ఎలోక్యూషన్, క్విజ్ పోటీలు పెట్టాలి. 23న ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థులకు అవగాహన, 24న పాడైన, పాత వస్తువులు, చెత్తను తొలగించాలి. 25న పాఠశాలల్లో మొక్కలు నాటడం, 26న చేతులు కడుక్కోవడంపై విద్యార్థులకు అవగాహన, 27న ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, యూత్ క్లబ్‌లను భాగస్వామ్యం చేయాలి. 28న రోజూ తరగతి గదులు, ల్యాబ్‌లు, బాత్‌రూమ్‌లు శుభ్రపరిచే అంశంపై ప్రత్యేక డ్రైవ్, 29న స్వచ్ఛత అవగాహనపై విద్యార్థులతో పాఠశాల పరిధిలో ర్యాలీలు చేయాలి. 30న స్వచ్ఛత ప్రదర్శన, ఉత్తమ పాఠశాలలకు బహుమతులు అందజేసే కార్యక్రమాలు నిర్వహించాలని ఏపీవో వివరించారు. ప్రతి రోజూ కార్యక్రమాలను సంబంధించిన ఫొటోలు, వీడియోలు, రిపోర్టులు, తప్పని సరిగా అదే రోజున సాయంత్రం ఏడు గంటల్లోపు గూగుల్ డ్రైవ్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

పులిచెర్ల మండలంలో కొనసాగుతున్న గజదాడులు

నాలుగు పంచాయతీల్లో పంటల ధ్వంసం



కల్లూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతున్నాయి. సోమవారం రాత్రి రెండు గ్రూపులుగా విడిపోయిన 16 ఏనుగులు కల్లూరు, పాళెం, పాతపేట, బోడిరెడ్డిగారిపల్లి పంచాయతీల్లో పంటలను నాశనం చేశాయి. దీంతో వరి, మామిడి, కొబ్బరి, వేరుశనగ పంటలకు అపారనష్టం వాటిల్లింది. పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని పెద్దవంక నుంచి బయలుదేరిన 10 ఏనుగుల గుంపు పాతపేట వద్దకు చేరుకున్నాయి. పలు పంటలను ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి కల్లూరు-సదుం రోడ్డును దాటుకొని చిట్టారెడ్డిపేట సమీపంలో చెరువుకట్టపై నుంచి ఏనుగు జారిపడి మృతి చెందిన ప్రాంతానికి చేరుకొని ఘీంకారం చేశాయి. అవులపెద్దిరెడ్డిగారిపల్లి, తలారివారిపల్లి, పూరేడువారిపల్లి గ్రామాల్లో రైతులకు చెందిన మామిడి, కొబ్బరిచెట్లు, వరి, వేరుశనగ పంటలను ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి అడవిలోకి తిరుగుముఖం పట్టిన ఏనుగుల గుంపు పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోకి చేరుకున్నాయి.పశ్చిమ విభాగం అటవీ ప్రాంతం నుంచి బయలుదేరిన 6 ఏనుగులు ఘాట్‌రోడ్డు సమీపంలోని రిలయన్స్ టవర్ వద్దకు చేరుకుని అక్కడ పంటలను ధ్వంసం చేశాయి. చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిని దాటుకొని అక్కడి నుంచి సైదుల్లా గుట్టవద్దకు ఏనుగుల గుంపు చేరుకున్నట్లు తెలిసింది.

కలెక్టరేట్ వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్, ప్రభాకర్ మాట్లాడుతూ దీర్ఘకాలంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పెండింగ్ బకాయిలను చెల్లించాలని, పీఆర్‌సీ ఏర్పాటు, డీఏ, సీపీఎస్ రద్దు, బోధనేతర పనులను తగ్గించడం వంటి వాటిని పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ జిల్లా గౌరవాధ్యక్షులు ముక్తార్ అహ్మద్, గౌరవ సలహాదారు గోపినాద్,ఉపాధ్యక్షులు నవీన్‌కుమార్, కార్యదర్శులు వేణు, లక్ష్మీపతి, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ భవనంలో నేడు విశ్వకర్మ జయంతి వేడుకలు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ మీటింగ్ హాలులోని ఎన్టీఆర్ సమావేశ మందిరంలో ఉదయం 10.30గంటలకు బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో దేవశిల్పిగా పేరుగాంచిన విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారని ఆ ప్రకటనలో తెలిపారు.

ఎన్ఎంఆర్, మజ్దూర్ వర్కర్లకు వేతనాల పెంపుపై సమీక్ష

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే ఎన్ఎంఆర్, మజ్దూర్ వర్కర్లకు మార్కెట్ రేట్లకు అనుగుణంగా కనీస వేతనాల పెంపు జరుగుతుందని డీఆర్వో మోహన్‌కుమార్ తెలిపారు. దీనిపై మంగళవారం కలెక్టరేట్‌లోని డీఆర్వో మీటింగ్ హాలులో కార్మిక, వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్ స్కిల్డ్ కేటగిరీల కింద జిల్లాలోని వివిధ ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న ఎన్ఎంఆర్, మజ్దూర్ వర్కర్స్, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, పారిశుధ్య కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారం మార్కెట్ రేటుకు అనుగుణంగా ఏడాదికి 5-10 శాతం వేతనాల పెంపు ఉంటుందని చెప్పారు. దీనిపై కలెక్టర్ అధ్యక్షతన నిర్ణయం తీసుకుంటారన్నారు. దీనిపై కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో సహాయ కార్మికశాఖ కమిషనర్ ఆలోచన, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రమణకుమార్, డ్వామా పీడీ రవికుమార్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉపకార వేతనాల కోసం ఫ్రెష్, రెన్యువల్ విద్యార్థులు జ్ఞానభూమి కళాశాల లాగిన్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి విక్రమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలను పొందడానికి తమ వివరాలను నమోదు చేయడానికి ప్రభుత్వం జ్ఞానభూమి పోర్టల్‌లోని కళాశాల లాగిన్‌లో ఆప్షన్ ఇచ్చిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ కళాశాలల యాజమాన్యం తమ కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు, ఈబీసీ విద్యార్థులు ఉపకార వేతనాలను పొందడానికి ఈ నెల 30వ తేదీ వరకు ప్రభుత్వం అవకాశం ఇచ్చిందన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు సంబంధించిన వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్లు వారి లాగిన్ ద్వారా సిక్స్ స్టెప్ వెరిఫికేషన్‌ను త్వరగా పూర్తిచేయాలని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఇక రేషన్ అక్రమాలకు చెక్

● 19 నుంచి రేషన్ షాపులకు స్మార్ట్ ఈ-పోస్ యంత్రాల పంపిణీ



కొత్త ఈ-పోస్ యంత్రం

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాపంపిణీ వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే స్మార్ట్ రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందజేసింది. ఇక రేషన్ అక్రమాలకు చెక్ పెట్టడానికి డీలర్లకు అధునాతన ఈ-పోస్ యంత్రాల పంపిణీకి శ్రీకారం చుట్టింది. 5జీ టెక్నాలజీతో పనిచేసేలా ఈ యంత్రాన్ని రూపొందించారు. ఇందులో స్మార్ట్ రేషన్ కార్డుల స్వైపింగ్‌తో వేలిముద్రల నమోదు ప్రక్రియ సులభతరం కానుంది. దుకాణాల వద్ద కార్డుదారులు గంటల తరబడి పడిగాపులు కాయాల్సిన అవసరం ఉండదు. వేలిముద్రలు పడనివారికి ఐరిష్ ద్వారా సరుకులు ఇచ్చే వెసులుబాటు ఈ యంత్రంలో ఉంది. గతంలోని యంత్రాలు 4జీ సాంకేతికతతో పని చేసేవి. తరచూ సిగ్నల్ సమస్యలతో మొరాయించేవి. ఈ సమస్యలను అధిగమించేలా కొత్త యంత్రాలు ఉంటాయి. ఈనెల 19వ తేదీ నుంచి కొత్త ఈ-పోస్ యంత్రాలను డీలర్లకు అందజేయనున్నారు.

చిత్తూరు నియోజకవర్గంలో 52,701 స్మార్ట్ కార్డుల అందజేత

చిత్తూరు నియోజకవర్గంలో 62,784 కార్డులున్నాయి. ఇప్పటి వరకు 52,701 స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. మిగిలిన కార్డులను ఈ నెలాఖరులోగా రేషన్ షాపుల ద్వారా అందజేస్తామని చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కులశేఖర్ తెలిపారు.

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌కు నేటినుంచి దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌కు ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి బుధవారం నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్ఎం రాము ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు www.apprenticeshipindia.gov.inలో అక్టోబరు 4వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. చిత్తూరు జిల్లాకు చెందిన వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. మొత్తం 48 ఖాళీలు ఉన్నాయన్నారు. డీజిల్ మెకానిక్ 33, మోటార్ మెకానిక్ 2, ఎలక్ట్రీషియన్ 8, వెల్డర్ 1, ఫిట్టర్ 3 ఖాళీగా ఉన్నట్లు వివరించారు. ఇతర వివరాలకు వెబ్‌సైట్‌ను లేదా 91542 91408 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఐటీఐల్లో ఖాళీ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు అర్బన్/రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు చిత్తూరు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిఉన్న విద్యార్థులు ఈనెల 27వ తేదీలోపు iti.ap.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 91825 90869 నెంబరును సంప్రదించాలని కోరారు. ప్రభుత్వ ఐటీఐలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 29న, ప్రైవేటు ఐటీఐలకు దరఖాస్తు చేసుకున్న వారికి 30వ తేదీ వెబ్ కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ● చిత్తూరు రూరల్ మండలంలోని బీఎస్ఆర్ పేట ఐటీఐలో సీవోపీఏ, మెకానిక్ డీజిల్, ఎలక్ట్రీషియన్, మెకానిక్ మోటార్ వెహికల్, డీ మ్యాన్ సివిల్ కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని ప్రిన్సిపాల్ నగేష్ పేర్కొన్నారు.

దంచేసిన వాన

రెండు మండలాల్లో 86.6 మిమీ వర్షం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ద్రోణి ప్రభావంతో గుడుపల్లె, కుప్పం మండలాలు మినహా 30 మండలాల్లో వర్షం దంచేసింది. అత్యధికంగా గంగవరం, ఐరాల మండలాల్లో 86.6మి.మీ, అత్యల్పంగా శాంతిపురంలో 1.8మి.మీ వర్షపాతం నమోదయ్యింది. సోమలలో 86.4మి.మీ, సదుం, పులిచెర్ల మండలాల్లో 60.6, వెదురుకుప్పంలో 56.4, పూతలపట్టులో 53.8, పుంగనూరులో 48.2, శ్రీరంగరాజపురంలో 45.4, గంగాధరనెల్లూరులో 45, చౌడేపల్లెలో 44, పలమనేరులో 43.4, రొంపిచెర్లలో 40.4, తవణంపల్లెలో 34, చిత్తూరు రూరల్‌లో 31.2, విజయపురంలో 30.2, నింద్ర, పెద్దపంజాణిలలో 29.2, పెనుమూరులో 25.2, పాలసముద్రంలో 24.2, నగరిలో 23.6, బంగారుపాళ్యంలో 23.4, చిత్తూరు రూరల్, బైరెడ్డిపల్లె మండలాల్లో 17.8, వి.కోటలో 8.4, గుడిపాల, కార్వేటినగరం మండలాల్లో 6.8, యాదమరిలో 4.4, రామకుప్పంలో 2.6 మిమీ వర్షం కురిసింది.

విద్యుత్ శాఖకు నష్టం

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా మంగళవారం కురిసిన వర్షంతో విద్యుత్ శాఖకు రూ.98 వేల నష్టం వాటిల్లిందని ఈఈ మునిచంద్ర తెలిపారు. ఐరాలలో 3 ,అరగొండలో ఒకటి, కొంగారెడ్డిపల్లెలో 5విద్యుత్ స్తంభాలు నేలకూలాయన్నారు. పైపల్లి పరిధిలో 16 కేవీ, 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు , ఐరాల పరిధిలో ఓ 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ పాడయ్యాయన్నారు.

విద్యార్థిని తల పగలకొట్టిన ఘటనపై సీఎంవో ఆరా

న్యాయం చేయాలని విద్యార్థిని తల్లి డిమాండ్ - సమాచారం ఇవ్వలేదని స్కూల్‌కు డీవైఈవో నోటీసు





న్యాయం చేయాలని ఎంఈవో నటరాజరెడ్డిని కోరుతున్న సాత్విక నాగశ్రీ తల్లి విజేత - స్కూల్లో టీచర్లను విచారిస్తున్న డీవైఈవో లోకేశ్వరరెడ్డి

పుంగనూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పుంగనూరు బాష్యం స్కూల్ హిందీ టీచరు సలీంబాషా విద్యార్థిని వి.సాత్విక నాగశ్రీ తల పగలకొట్టిన ఘటనపై మంగళవారం ముఖ్యమంత్రి కార్యాలయం ఆరా తీసి ప్రాథమిక నివేదిక తెప్పించుకుంది.అదే పాఠశాలలో బాధిత విద్యార్థిని తల్లి విజేత ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుండగా కుమార్తె ఆరవ తరగతి చదువుతోంది. సాత్వికనాగశ్రీ అల్లరి చేస్తోందంటూ ఈనెల 10 తేదిన తలపై టీచరు సలీంబాషా క్యారియర్ బ్యాగుతో కొట్టాడు.దీంతో తల ఎముక విరిగి బెంగళూరు సెయింట్ జాన్స్ ఆస్పత్రిలో సాత్వికనాగశ్రీ చికిత్స పొందుతోంది సీఎంవోకు డీఈవో వరలక్ష్మి నివేదిక పంపారు.మదనపల్లె డీవైఈవో లోకేశ్వరరెడ్డి ప్రభుత్వ ఆదేశాలతో ఈ ఘటనపై విచారణకు మంగళవారం ఎంఈవో నటరాజరెడ్డితో కలిసి స్కూలుకు వెళ్లారు.ప్రిన్సిపాల్ అందుబాటులో లేకపోవడంతో అక్కడ పనిచేసే ఉపాధ్యాయులతో, విద్యార్థులతో మాట్లాడారు. తమకు న్యాయం చేయాలంటూ విద్యార్థిని తల్లి విజేత, స్కూలు గేటు వద్ద రోదిస్తూ విన్నవించారు.భర్త చనిపోయిన తన పట్ల ప్రిన్సిపాల్ అసభ్యకరంగా, హేళనగా మాట్లాడారని ఫిర్యాదు చేశారు.తన బిడ్డను క్రూరంగా హిందీ టీచరు తల ఎముక పగిలేలా కొట్టాల్సిన పని ఏముందని వాపోయారు. పాఠశాలలో వారం క్రితం జరిగిన ఈ విషయం ప్రభుత్వం దృష్టికి ఎందుకు తీసుకురాలేదంటూ బాష్యం స్కూల్ యాజమాన్యానికి డీవైఈవో లోకేశ్వరరెడ్డి నోటీసు జారీ చేశారు. మూడురోజుల్లోపు సంజాయిషీ ఇవ్వకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కాగా ఈ ఘటనకు సంబంధించి భాష్యం స్కూల్ యాజమాన్యంపై క్రిమినల్ కేసు పెట్టాలని డిమాండు చేస్తూ ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు స్కూలు ముందు ధర్నా చేశారు.బాధితురాలి వైద్యఖర్చులు పాఠశాల యాజమాన్యమే భరించాలని డిమాండు చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్రసమితి సభ్యుడు మున్నా ,ధనంజయ, ప్రవీణ్,రాజేశ్, లోకి, బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. ఆరవ తరగతి విద్యార్థిని తలపగలకొట్టిన ఘటన ప్రైవేటు విద్యాసంస్థల నిర్లక్ష్యానికి పరాకాష్ట అని బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ నేడొక ప్రకటనలో ఆరోపించారు.బాధితురాలి కుటుంబానికి అండగా ఉంటానన్నారు.

జిల్లా పర్యాటక శాఖాధికారిగా నరేంద్ర కుమార్



చిత్తూరు క్రీడలు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటక శాఖాధికారిగా నరేంద్రకుమార్‌ను డిప్యుటేషన్‌పై నియమిస్తూ సోమవారం రాత్రి ఏపీ టూరిజం అథారిటీ డిప్యూటీ సీఈవో శ్రీనివాస ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన చిత్తూరులోని సావిత్రమ్మ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. ఒక సంవత్సరంపాటు డిప్యుటేషన్‌పై నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న గౌరిని ఆమె మాతృ శాఖ అయిన జిల్లా పరిషత్‌కు బదిలీ చేశారు.

పశుసంవర్ధక శాఖ జేడీగా ఉమామహేశ్వరి

అమరావతి, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టరుగా డి.ఉమామహేశ్వరిని నయమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.తిరుపతిలోని పశువైద్య విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పని చేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు రాయల్‌రెడ్డి, శివసాగర్‌రెడ్డిల డిప్యూటేషన్‌ను మరో ఏడాది పొడిగించింది.

అసత్యం వైసీపీ అభిమతం : శాప్ చైర్మన్

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : ఇచ్చిన మాట ప్రకారం డీఎస్సీ నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కూటమి ప్రభుత్వం కల్పించిందని శాప్ చైర్మన్ రవినాయుడు తెలిపారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ డీఎస్సీని అడ్డుకోవాలని వైసీపీ సకల ప్రయత్నాలు చేసిందన్నారు. హైకోర్టులో 104 కేసులను వేసినా వాటిని కొట్టివేశారని చెప్పారు. ఈ విషయంలో మంత్రి లోకేష్ సమర్థతతో పనిచేశారని వివరించారు.

కోర్టు చుట్టూ టీడీపీ నేతల ప్రదక్షిణలు



చిత్తూరు కోర్టు వద్ద కుప్పం టీడీపీ నాయకులు

కుప్పం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): 2021వ సంవత్సరం నమోదైన కేసులో కుప్పం టీడీపీ నాయకులు ఇప్పటికీ కోర్టు చుట్టూ తిరుగుతున్నారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు 2021లో రామకుప్పం మండలం కొల్లుపల్లెలో పర్యటించారు. ఈ సమయంలో టీడీపీ నేతలు తమపై హత్యాయత్నం చేశారంటూ కొంతమంది వైసీపీ నాయకులు వారిపై కేసు పెట్టారు. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, చెక్కునత్తం మణి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, పూల మంజునాథ్ సహా మొత్తం 36 మంది నాయకులపై కేసు నమోదైంది. చిత్తూరు కోర్టులో కేసు నడిచింది. వైసీపీ అధికారంలో ఉన్నంతకాలం చిత్తూరు కోర్టుకు వాయిదాల మీద వాయిదాలకు ఈ నాయకులు హాజరవుతూ వచ్చారు.గత ఏడాది టీడీపీ అధికారంలోకి వచ్చి స్థానిక ఎమ్మెల్యే చంద్రబాబు ముఖ్యమంత్రి పీఠం అధిష్ఠించారు. టీడీపీ నాయకులపై అక్రమంగా బనాయించిన కేసులన్నీ మాఫీ చేస్తామని పలుమార్లు ప్రకటించారు. అయినా కుప్పం నేతలపై బనాయించిన కొల్లుపల్లి కేసు మాత్రం మాఫీ కాలేదు. మంగళవారంనాడు కూడా ఈ కేసులో ఉన్న నాయకులు, కార్యకర్తలు చిత్తూరు కోర్టుకు హాజరయ్యారు. మళ్లీ 29వ తేదీకి కేసు వాయిదా పడింది.తమ కేసును గురించి టీడీపీ అధిష్ఠానం పట్టించుకోవడంలేదని పార్టీ శ్రేణులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.

సీఎం చంద్రబాబుతోనే మహిళాభ్యుదయం సాధ్యం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు, చల్లా బాబు

కల్లూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడుతోనే మహిళాభ్యుదయం సాధ్యమని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మినీ అంగన్‌వాడీలకు ప్రధాన కేంద్రాల హోదా కల్పించడంపై పులిచెర్ల మండలం మంగళంపేట అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సదుం, రొంపిచెర్ల, పులిచెర్ల మండలాల్లోని మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా చల్లా రామచంద్రారెడ్డి సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చడంతో జీతాలు పెరుగుతాయని తెలిపారు. అనంతరం తిరుపతి రమాదేవి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. మాజీ జడ్పీటీసీ సభ్యులు మురళీధర్, విండో అధ్యక్షులు ధనంజయనాయుడు, టీడీపీ నాయకులు కుమార్‌రెడ్డి, మహేష్, నజీర్, రామ్మూర్తి, ప్రభాకర్, రియాజ్, సయ్యద్‌బాషా, అంగన్‌వాడీ సంఘం నాయకురాళ్లు ప్రేమలత, సరస్వతి, మొబీనా, సుజాత, శ్యామల, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బోయకొండ గంగమ్మ ఆలయానికి రూ.24 లక్షల ఆదాయం



వేలం నిర్వహిస్తున్న బోయకొండ ఆలయ సిబ్బంది

చౌడేపల్లె, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయానికి వేలంతో రూ.24 లక్షలు ఆదాయం చేకూరినట్లు ఆలయ ఈవో ఏకాంబరం తెలిపారు. మంగళవారం కొండ కింద ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లోని 85 దుకాణ గదులకు గాను 45 గదులకు వేలం నిర్వహించారు. మిగిలిన గదులకు బుధవారం వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

గాంధీనగరంలో తీరిన తాగునీటి సమస్య



బోరుకు పైపులు అమర్చే కార్యక్రమంలో టీడీపీ నేతలు

రామకుప్పం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం కెంచనబల్ల పంచాయతీ గాంధీనగరం గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య ఎట్టకేలకు తీరింది. గ్రామంలోని దశాబ్దాల క్రితం రక్షిత మంచినీటి పథకం బోరులో గత కొన్నేళ్లుగా జలాలు తగ్గిపోయాయి. దీంతో గ్రామంలోని 25కు పైగా కుటుంబాలకు నీరందని పరిస్థితి ఏర్పడింది. అధికారులు, ప్రజాప్రతినిధులకు గ్రామస్తులు తాగునీటి సమస్యపై పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోయింది. చంద్రబాబు సీఎం కావడంతో గ్రామస్తులు, పంచాయతీ టీడీపీ పెద్దలు సమస్యను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన కలెక్టరు గ్రామానికి అదనపు బోరు మంజూరు చేశారు. ఇటీవల బోరు తవ్వకం చేపట్టారు. మంగళవారం టీడీపీ పంచాయతీ నేతలు సత్తి, చంద్రశేఖర్‌రెడ్డి, గుణశేఖర్ స్థానిక నేతలో కలిసి బోరుకు మోటారు అమర్చి నీటి సరఫరాను ప్రారంభించారు. కార్యక్రమంలో నేతలు శ్రీరామప్ప, బద్రీ, వెంకటరమణ, గోవిందప్ప, బాలాజీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ప్రీ ప్లేస్‌మెంట్ డ్రైవ్



కంపెనీల హెచ్‌ఆర్‌లతో ప్రిన్సిపాల్ జగన్నాథరావు తదితరులు

కుప్పం, సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి): కుప్పంలోని జేమ్స్ యెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో మంగళవారం ప్రీ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. బెంగళూరుకు చెందిన కీనెస్ టెక్నాలజీస్ హెచ్‌ఆర్ మేనేజరు అంపిలి క్యూఎంఎస్ అండ్ క్యూప కంపెనీ హెచ్‌ఆర్ మేనేజరు యోగమూర్తి విద్యార్థులను ఇంటర్వ్యూలు చేశారు. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజనీరింగు విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరిలో 58 మంది విద్యార్థులను ఎంపిక చేసి డిప్లమో పూర్తి అయిన తర్వాత ఉద్యోగ అవకాశం కల్పించడానికి ఈ రెండు కంపెనీలు ఒప్పందం చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగన్నాథరావు తెలిపారు. కార్యక్రమంలో ఈసీ విభాగాధిపతి జి.రామకృష్ణరావు, కో ఆర్డినేటర్ ఎల్.మాణిక్యం, ప్రవీణ్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఆటల పోటీలు



క్రీడా పోటీల్లో విజేతలు

సోమల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సోమల ఉన్నత పాఠశాలలో జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో సాగిన మండలస్థాయి ఆటల పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పలువురు విజేతలుగా నిలిచినట్లు ఎంఈవో శివరత్న తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం హేమసుధాకర్, వ్యాయామ ఉపాధ్యాయులు కరుణానిధి, శివకుమార్, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **శాంతిపురం:** ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం శాంతిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో అండర్-14, 17 బాల, బాలికల క్రీడా పోటీలు నిర్వహించారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, చెస్, బ్యాడ్మింటన్, యోగా పోటీలు జరిగాయి. సుమారు 19 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 3 ప్రైవేటు పాఠశాలల నుంచి 350 మంది విద్యార్థులు హాజరయ్యారు. పీడీలు డిల్లీబాబు, విజయలక్ష్మి, మునికృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు లోకేశ్‌కు నివాళి

పుంగనూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన కె.లోకేశ్ కుటుంబానికి ఏపీడబ్ల్యూజేఎఫ్ అండగా ఉంటుందని ఫెడరేషన్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో ఆయన చిత్రపటం ఏర్పాటు చేసి నివాళులర్పించారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు శివశంకర రాజు, జయరాజ్, వి.జయచంద్ర, సలీం, సైఫుల్లా, శ్రీనివాసులు, ప్రకాశ్, మహేశ్, మురళి, నీరజాక్షులు, అప్పా, రామయ్య, రాజు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆనందరెడ్డి

రామకుప్పం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి తెలిపారు. మంగళవారం రామకుప్పం పట్టణ శివార్లలోని అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో మండల స్థాయి క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి శ్రద్ధతో పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరచాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో నారాయణప్ప, వైస్ఎంపీపీ వెంకట్రామగౌడు, రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, సింగిల్‌విండో చైర్మన్ మహ్మద్‌రఫీ, బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి రాజసింహా, జనసేన మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరీష్, భాస్కర్, నేతలు గుర్రప్ప, టీవీ రవి, మురళీ తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

కుప్పం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధాని నరేంద్ర మోదీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం కుప్పంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ర్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు భారతీయ జనతాపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్ఎస్.తులసీనాథ్ తెలిపారు. అలాగే మోదీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

శాంతిపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం తుమ్మిశి ఐటీఐ కళాశాలలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ శేషారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఐటీఐలో చేరేందుకు గతంలో మూడు సార్లు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, నాలుగోసారి మరో అవకాశం కల్పించిందన్నారు. అర్హులైన విద్యార్థులు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో ఈనెల 27వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. 28న తుమ్మిశి ఐటీఐలో ఒరిజినల్ సర్టిఫికెట్లను అందించి వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. 29న కళాశాలలో జరిగే కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసిన విద్యార్థులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

నానో యూరియాపై రైతులు దృష్టి సారించాలి



జగమర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

పలమనేరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వరి సాగు చేస్తున్న రైతులు సంప్రదాయ ఎరువులకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వినియోగించాలని వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ మురళీకృష్ణ సూచించారు. మంగళవారం పలమనేరు మండలం జగమర్ల గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు కార్యక్రమంలో ఏవో సంధ్య, పట్టుశాఖ అధికారి ఫిరోజ్‌బాషా, స్టేట్ బ్యాంక్ ఫీల్డు ఆఫీసర్ లోకేష్, టీడీపీ నాయకులు ధనంజయరెడ్డి, రైతు సేవా కేంద్రం తనిఖీ, జగమర్ల రైతులు పాల్గొన్నారు.

మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు



సోమలలో మాట్లాడుతున్న డాక్టర్ జయసింహ

సోమల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 538 ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు చేపట్టనున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జయసింహ తెలిపారు. మంగళవారం సోమల పీహెచ్‌సీలో అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళల్లో రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అక్టోబర్ 2వ తేదీ వరకు జరిగే ఉచిత శిబిరాల్లో భాగంగా సోమల మండలంలో 18వ తేదీన చిన్నఉప్పరపల్లె, 19న రెడ్డివారిపల్లె, 20న ఇరికిపెంట, 22న నంజంపేట, 23న పొదలకుంటపల్లె, 27న సోమలలో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వైద్యాధికారి ప్రదీష్ కుమార్ రెడ్డి, సీహెచ్‌వో అమరనాథ్, ఆశ కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కౌండిన్యలో మురుగునీరు..!

● రిజర్వాయర్‌లో నీరున్నా.. నిరుపయోగం ● పట్టించుకోని అధికారులు, నాయకులు



పలమనేరు సమీపంలోని కౌండిన్య రిజర్వాయర్‌లో చేరిన నల్లటి నీరు

పలమనేరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పలమనేరుకు తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం కౌండిన్య నదిపై కాలువపల్లి సమీపంలో నిర్మించిన కౌండిన్య రిజర్వాయర్‌లో ఇటీవల చేరిన నీరు మురుగునీటిని తలపిస్తోంది. దీంతో రిజర్వాయర్‌లో ఉన్న నీటిని వినియోగించుకోలేని దుస్థితి నెలకొంది. వర్షాలు బాగా కురిసి కౌండిన్య నది పొంగి పొర్లితే గాని రిజర్వాయర్ నీటిని వినియోగించుకునే పరిస్థితి కనిపించడం లేదు. దీనికి తోడు రెండురోజుల క్రితం ఈ రిజర్వాయర్‌లో పలమనేరుకు చెందిన వ్యక్తి చనిపోయి శవం బాగా కుళ్లిపోయే స్థితిలో వెలికి తీశారు. రిజర్వాయర్‌లో ఇప్పుడు చేరిన మురుగునీరు పలమనేరు ప్రజలకు ఎలా తాగునీటి కోసం అధికారులు సరఫరా చేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పలమనేరుకు ఆనుకొనే ఉన్న పెద్దచెరువు 90 శాతం నిండిన విషయం తెలిసిందే. అయితే ఈ చెరువు నిండటంతో ఆక్రమణదారులకు ఇబ్బందికరంగా ఉన్నందున కొందరు సరాసరి చెరువుకట్టకు గండికొట్టారు. దీంతో ఈ పెద్దచెరువులోని దాదాపు మూడొంతులు వర్షపు నీటితో ఉన్న మురుగు నీరు పలమనేరు ఆయకట్టుమీదుగా బొమ్మిదొడ్డిచెరువుకు చేరింది. అప్పటికే నిండిఉన్న బొమ్మిదొడ్డిచెరువు ఈ పెద్దచెరువు నీటితో కలుజు పారి ఆ నీరు కౌండిన్యనదికి చేరింది. అలా చేరిన నీరు క్రమేపీ కౌండిన్య నదిలో ప్రవహిస్తూ కౌండిన్య రిజర్వాయర్‌కు చేరింది. దాదాపు రెండేళ్లక్రితం అడుగంటిపోయిన కౌండిన్య రిజర్వాయర్ ఈ నీటితో సగం మేర నిండింది. అయితే ఈ నీరు మురుగునీటిని తలపిస్తోంది. దీనికి కారణం పలమనేరు పెద్దచెరువులోకి పట్టణంలోని దాదాపు 50 శాతం మురుగునీరు కాలువల ద్వారా చేరుతుంది. దీంతో ఈ చెరువులో ఉన్న నీటిలో దాదాపు 70 శాతం మురుగునీరే. భూగర్భ జలాలు సైతం కలుషితమైపోయాయి. ఇలాంటి మురుగునీరు కౌండిన్య నదిలో చేరి నది నీరు కూడా కలుషితమై కౌండిన్య రిజర్వాయర్‌కు చేరింది. వర్షాలు మరింత కురిసి కౌండిన్య నది ఉధృతంగా ప్రవహించి రిజర్వాయర్ పొంగి కొన్ని రోజులపాటు ప్రవహిస్తే తప్ప మురుగునీరు రిజర్వాయర్ నుంచి బయటకు వెళ్లే అవకాశాలు లేవు. పలమనేరు పట్టణంలోని మురుగునీరు పెద్ద చెరువులో కలువకుండా మురుగునీటి ట్రీట్‌మెంట్ ప్లాంటు నిర్మాణానికి కేంద్రం నిధులు మంజూరు చేసింది. అయితే ఇందుకు కావాల్సిన భూమిని అధికారులు సేకరించలేకపోయారు. చెరువు ఆయకట్టులో ఈ ట్రీట్‌మెంట్ ప్లాంటు నిర్మాణానికి ప్రతిపాదించినప్పటికీ మున్సిపల్ పాలకవర్గంతో పాటు ఆయకట్టుదారులు సైతం మురుగునీటి ట్రీట్‌మెంట్ ప్లాంటు నిర్మాణానికి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో నిర్మాణం ఆటకెక్కింది. దీంతో పట్టణ ప్రజలకు తాగునీటిని అందించేందుకు అధికారులు ఈ మురుగునీటినే ట్రీట్‌మెంట్ చేసిస్తారా... కౌండిన్య నది ప్రవహించి రిజర్వాయర్‌లో ఉన్న మురుగునీరు వెలుపలికి వెళ్లేంత వరకు వేచి ఉంటారా తెలియాల్సి ఉంది. అయితే ఈ నీటినే తాగునీటి కోసం సరఫరా చేయనున్నట్లు సమాచారం.

15 రోజుల్లో ఆక్రమణలను తొలగించాలి

● కడా పీడీ వికాస్ మర్మత్



అధికారులతో మాట్లాడుతున్న కడా పీడీ వికాస్ మర్మత్

శాంతిపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శాంతిపురంలో వెంటనే ఆక్రమణలను తొలగించాలని ఎంపీడీవో ఏపీఆర్ కుమార్, తహసీల్దార్ శివయ్యను కడా పీడీ వికాస్ మర్మత్ ఆదేశించారు. మంగళవారం శాంతిపురం మండల స్థాయి అధికారులతో కలిసి మండలంలో విస్తృతంగా పర్యటించారు. శాంతిపురం బస్టాండు, మండల కేంద్రంలోని ప్రధాన రాజుకాలువ, ప్రజా సౌకర్య మురుగుదొడ్లు, పాలారు నది ఆక్రమణలను, చిట్టేపల్లె బయ్యప్ప చెరువు, కుప్పం-పలమనేరు జాతీయ రహదారిలో ఆక్రమణలను ఆయన పరిశీలించారు. సంబంధించిన రెవెన్యూ రికార్డులను సరిచూశారు. 15 రోజుల్లో ఆక్రమణలు తొలగించాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. రాజు కాలవపైన నిర్మించిన భవన యజమానికి నోటీసులు ఇవ్వాలని ఆదేశాలు జారీచేశారు. గడ్డూరు చెరువు నుంచి పాలారు నదిలోకి ప్రవహిస్తున్న రాజుకాలువలో నిర్మించిన అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలని తెలిపారు. శాంతిపురం బస్టాండును వెంటనే నిర్మించాలని ఆదేశించారు. ఆ స్థలం తమదంటూ కొందరు రికార్డులు తీసుకొచ్చి కడా పీడీకి చూపడంతో పరిశీలించిన ఆయన ప్రభుత్వానికి సంబంధించిన గ్రామ కంఠం భూమి అన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, మాజీ వైస్ ఎంపీపీ నందిగం ఉదయకుమార్ నాయుడు, సింగిల్ విండో చైర్మన్ గోపాల్, శాంతిపురం క్లస్టర్ ఇన్‌చార్జి రాజేంద్ర, మాజీ సింగల్ విండో చైర్మన్ రాధాకృష్ణమనాయుడు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ నాగరాజు, రాళ్ళబూదుగూరు క్లస్టర్ ఇన్‌చార్జి పీవీ నాగరాజు, యూనిట్ ఇన్‌చార్జిలు గిరిధర్, నారాయణస్వామి, విజయకుమార్, సుగుణమ్మ, రాళ్ళబూదుగూరు మాజీ క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, రమేష్, మంజునాథ్, శివకుమార్, పలు శాఖల అధికారులు, టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవాళి మనుగడకు ఓజోన్ పొర కీలకం



గంగవరం: అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

గంగవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మానవాళి మనుగడ సజావుగా సాగాలంటే ఓజోన్ పొర కీలకమని మండలంలోని జీయల్‌యస్ ఫారం హైస్కూల్ హెచ్ఎం విజయశేఖర్ అన్నారు. మంగళవారం ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జీయల్‌యస్ ఫారం హైస్కూల్‌లో విద్యార్థులకు ఓజోన్ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీడీ సురేష్, ఉపాధ్యాయులు సంగీత, పట్టాభి, సిద్దమ్మ, సుగుణమ్మ, లక్ష్మీ, మోక్షప్రద పాల్గొన్నారు.

● **కల్లూరు:** ఓజోన్ పొరను రక్షించుకోవడం అందరి బాధ్యతని పాఠశాల హెచ్ఎం శ్రీవాణి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ఓజోన్ పొర రక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఓజోన్ ప్రాముఖ్యతను తెలియజేయడంతో సమస్యపై సామూహిక బాధ్యతను పెంపొందించొచ్చని తెలిపారు. ఉపాధ్యాయులు రహమత్‌బాషా, రేణుకాదేవి, రాజేంద్ర, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



కల్లూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న నాయకులు

రొంపిచెర్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల బాలుర జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్థానిక టీడీపీ యువ నాయకులు విద్యాసామగ్రిని మంగళవారం అందజేశారు. 260 మంది పిల్లలకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ధనలక్ష్మి, నాయకులు నాగార్జున, హరిబాబు, నాగరాజ, శశికుమార్, గౌస్‌పీర్‌ఖాన్, శివకుమార్, నీఈం, తౌసీంఖాన్, తులసీరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సముచిత స్థానం

రొంపిచెర్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్నివర్గాల వారికి టీడీపీ ప్రభుత్వం సముచిత స్థానం కల్పిస్తోందని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. రొంపిచెర్ల మార్కెట్ కమిటీ డైరెక్టర్, మండల టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు ఈశ్వరయ్య మంగళవారం రొంపిచెర్ల టీడీపీ కార్యాలయంలో చల్లా రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సహదేవ, బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ టీడీపీ నాయకులు సురేంద్ర, సహదేవ, చలపతి, చిట్టిబాబు, మనోజ్, ప్రసాద్, అమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యార్థులకు వికలత్వ నిర్ధారణ పరీక్షలు

పలమనేరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గంగవరం, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లి, పలమనేరు, పుంగనూరు మండలాల్లోని దివ్యాంగ విద్యార్థులకు ఈనెల 18న గురువారం స్థానిక విద్యానగర్ పాఠశాలలో వైద్య నిర్ధారణ ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంఈవో లీలారాణి తెలిపారు. ఐదు మండలాల్లోని దివ్యాంగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రెండు పాస్‌పోర్టు ఫొటోలు, విద్యార్థి గుర్తింపు కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్‌కార్డు, ఇప్పటి వరకు తీసుకున్న దివ్యాంగ సర్టిఫికెట్ వెంట తీసుకురావాలన్నారు. వివరాలకు ఫోన్‌నంబర్లు 9885377508, 9866638308 లను సంప్రదించాలని కోరారు.

ప్రైవేటు విద్యాసంస్థల నిర్లక్ష్యమే సాత్విక నాగశ్రీ ఘటన : బీసీవై

పుంగనూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు విద్యాసంస్థల నిర్లక్ష్యమే పుంగనూరు భాష్యం స్కూల్‌లో ఆరో తరగతి విద్యార్థిని సాత్విక నాగశ్రీ ఘటన అని.. బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థినిపై కొట్టిన ఘటనపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితురాలి తల్లి విజేతతో తాను ఫోన్‌లో మాట్లాడి బాలిక ఆరోగ్యపరిస్థితిపై ఆరా తీశానని, వారి కుటుంబానికి అండగా ఉంటానని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలల పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయని, పిల్లలపై తీవ్ర ఒత్తిడి కల్పిస్తున్నారని, ఫలితాల నెపంతో పిల్లలను తీవ్రంగా ఇబ్బందులు పెట్టడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రైవేటు విద్యాసంస్థలను గాడిలో పెట్టాలని డిమాండ్ చేశారు.

వైభవంగా మండల పూజ



రామకుప్పం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం బల్ల పంచాయతీ పాలరేవుగడ్డలోని వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కుంభాభిషేక మహోత్సవం గత నెల జరిగింది. కుంభాభిషేకం జరిగి 48వ రోజుకు చేరుకోవడంతో మంగళవారం ఆలయంలో మండల పూజను ఘనంగా నిర్వహించారు. ఉదయం వేదపండితులు గణపతి, వాస్తు, నవగ్రహ హోమాలు చేపట్టారు. అనంతరం స్వామివారికి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి విశేష అలంకరణలు చేశారు. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను చుట్టుపక్కల గ్రామాల్లో ముత్యాలపల్లకీపై ఊరేగించారు. భక్తులు దేవతా మూర్తులకు కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులిచ్చారు. సాయంత్రం స్వామి వారి కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి, మాజీ ఉపసర్పంచు సత్తి, నేతలు ఎర్రప్ప, శ్రీనివాసులు, శంకర్ పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

సోమల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని పలు గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నవారణకు టీకాల కార్యక్రమాన్ని మంగళవారం ఏడీహెచ్ శ్రీనివాసులు నాయుడు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలలకు పైబడిన పశువులన్నింటికీ టీకాలు వేయాలన్నారు. టీకాలు వేయడంతో పాల దిగుబడి తగ్గిపోతుందనే అపోహని రైతులు వీడాలని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ చందనప్రియ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గుండ్లసాగరంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

గుడుపల్లె, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లసాగరంలో మంగళవారం నూతన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌ను రెస్కో డైరెక్టర్ అమీర్ ఏర్పాటు చేశారు. గుండ్లసాగరం గ్రామానికి చెందిన లతా ఉమాపతికి మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఒక్క సంవత్సరం క్రితం వ్యవసాయ భూమిలో బోరు బావి తవ్వారు. బోరు మోటారు కోసం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకొన్నారు. సోమవారం ఆ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో రెండు ఎకరాల్లో ఉన్న బంతి, టమోటా పంటకు నీరందక ఎండిపోతుందని రెస్కో డైరెక్టర్ అమీర్ దృష్టికి రైతు సమస్యను తీసుకెళ్లాడు. వెంటనే స్పందించిన ఆయన సూచనలతో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను అధికారులు అమర్చారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ


బాధితుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నిండ్ర, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను బాధితులకు నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ మంగళవారం పంపిణీ చేశారు. నగరి రూరల్ మండలం చిన్నతాంగేశ్ గ్రామానికి చెందిన గోపాల్‌కు రూ.45వేలు, అగరంకు చెందిన గజేంద్రకు రూ.1,20,000, కేజీ కుప్పంకు చెందిన పి.లోకేష్‌కు రూ.54,150, దేసూరు, అగరంకు చెందిన జయకృష్ణకు రూ.99,782, నిండ్ర మండలం కేఆర్ పాళెంకు చెందిన టి.హరీష్‌కు రూ.75,102, కావనూరుకు చెందిన బి.జయమ్మకు రూ.25,000, నగరి మున్సిపాలిటీ పుదుపేటకు చెందిన కె.రాజశేఖర్‌కు రూ.67,461, నారాయణవనం మండలం ఎగువ బొప్పరాజుపాళెంకు చెందిన రచనకు రూ.25,000 కలిపి మొత్తం ఎనిమిది మందికి రూ.5,11,495 చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టండి: జడ్పీ సీఈవో


సమావేశంలో ప్రసంగిస్తున్న జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు

తవణంపల్లె, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు ఆదేశించారు. మంగళవారం తవణంపల్లె ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక సంఘం నిధులతో పారిశుధ్య పనులతోపాటు గ్రీన్ అంబాసిడర్లకు వేతనాల చెల్లింపులు, ట్రైసైకిళ్ల కొనుగోలు చేసుకోవచ్చని వివరించారు. అలాగే తాగునీటి అవసరాలు, డ్రైనేజి పనులతోపాటు పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులకు నిధులు వెచ్చించాలన్నారు. డీపీవో సుధాకర రావు, డీఎల్‌పీవో రవికుమార్, ఎంపీడీవో రెడ్డిబాబు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు: కమిషనర్


సిబ్బందితో మాట్లాడుతున్న నరసింహప్రసాద్

చిత్తూరుఅర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దని కమిషనర్ నరసింహ ప్రసాద్ చెప్పారు. నగరంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను మంగళవారం తనిఖీ చేశారు. వెంగళరావు కాలనీలో వర్షపు నీరు వీధుల్లో నిలుస్తుందనే ఫిర్యాదుపై పరిశీలించారు. స్థానికంగా కాలువను పరిశీలించి, చేపడుతున్న పనులపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. కాలువలకు అవుట్‌లెట్ లేకపోవడం వల్లే ఇబ్బందులు వస్తున్నాయని గుర్తించి, ఇంజనీరింగ్ అధికారులకు సూచనలిచ్చారు. ప్రధాన రహదారుల వెంట బుష్‌కటింగ్ జరుగుతోందని, షెడ్యూల్ ప్రకారం పారిశుధ్య పనులు జరుగుతున్నాయని ఎంహెచ్‌వో లోకేష్ వివరించారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కట్టమంచిలో మరో భవనం తొలగింపు


పనులను పర్యవేక్షిస్తున్న ఏసీపీ నాగేంద్ర

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హైరోడ్డు విస్తరణలో భాగంగా టౌన్‌ప్లానింగ్ అధికారులు మరో భవనాన్ని తొలగించారు. కట్టమంచి వెంకుష కళ్యాణ మండపం నుంచి న్యూ కలెక్టరేట్ వరకు వంద అడుగుల రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో కట్టమంచిలోని వంద అడుగులకు అవసరమైన స్థల సేకరణలో భాగంగా ఓ ప్రైవేటు భవన యజమానిని ఒప్పించి మంగళవారం దాన్ని తొలగించారు. ఈ పనులను ఏసీపీ నాగేంద్ర పర్యవేక్షించారు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు, డీఈ మునిచంద్ర

యాదమరి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి):దాసరాపల్లె పంచాయతీలో విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటుకు మంగళవారం అధికారులు స్థల పరిశీలన చేశారు. మండలవాసులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించాలనే ఉద్దేశంతో ఈ ఉపకేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ పార్థసారథి, విద్యుత్‌శాఖ డీఈ మునిచంద్ర, ఏఈ గుర్రప్ప, ఆర్ఐ ప్రసాద్, సర్వేయర్ తులసీధర్, వీఆర్వో సురేష్ బాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు


చెస్ ఆడుతున్న ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయం

నిండ్ర, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరి పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, చెస్, యోగా, ఖోఖో పోటీలు నిర్వహించారు. ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయం చెస్ ఆడి, పోటీలను మంగళవారం ప్రారంభించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 320 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మండల క్రీడా కమిటీ కన్వీనర్ మణి, పీడీ సురేష్ నేతృత్వంలో ఈ పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు శ్యామలాదేవి, వివిధ పాఠశాలలకు చెందిన పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

'స్వస్థ నారీ సశక్త పరివార్'ను పకడ్బందీగా నిర్వహించాలి

● స్టేట్ నోడల్ అధికారి సునీల్ నాయక్


సమావేశంలో ప్రసంగిస్తున్న సునీల్ నాయక్

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం నుంచి ప్రారంభం కానున్న స్వస్థ నారీ సశక్త పరివార్ అభియాన్‌ను పకడ్బందీగా నిర్వహించాలని స్టేట్ నోడల్ అధికారి సునీల్ నాయక్ ఆదేశించారు. మంగళవారం చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో డీఎంహెచ్‌వో, డీసీహెచ్‌ఎస్, అపోలో అధికారులతో ఈ అంశంపై సమీక్షించారు. అనంతరం రోగులకోసం ఎంసీహెచ్ భవనంలో ఏర్పాటు చేసిన వార్డును తనిఖీ చేశారు. వైద్యశిబిరాలపై ఇంటింటికీ వెళ్లి మహిళలకు సమాచారం ఇవ్వాలని ఆశా కార్యకర్తలకు, వైద్య సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో సుధారాణి, అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, చిత్తూరు ప్రభుత్వాస్పత్రి ఎంఎస్ ఉషశ్రీ, ఆర్ఎంవో సంధ్య, అపోలో అధికారులు పాల్గొన్నారు.

పాలేటమ్మకు ప్రత్యేక పూజలు



ఐరాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గార్గేయనదీ తీరాన ఉన్న పాలేటమ్మ ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత వారం ఆలయంలో అమ్మవారి పురాతన శిరస్సును అపహరించడానికి కొందరు ప్రయత్నించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అపచారం తొలగిపోవాలని అమ్మవారికి పూజలు చేశారు. ఉదయం పొంగళ్లు సమర్పించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంకే బాలాజీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వరదరాజులపల్లెలో 'పొలం పిలుస్తోంది'

యాదమరి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వరదరాజులపల్లెలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దని, అవసరానికి అనుగుణంగా సరఫరా ఉంటుందని వ్యవసాయాధికారి దీప తెలిపారు. రైతు సేవా కేంద్ర సిబ్బంది పూజ తితరులు పాల్గొన్నారు.




ఆస్థాన మండపంలో కళాకారిణుల నృత్యాభినయం - శశిరేఖా పరిణయం పౌరాణిక నాటకంలోని సన్నివేశం

గణేశ్ ఇరుముడుల సమర్పణ

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలో నిర్వహించిన వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్వామి మాలను ధరించిన భక్తులు మంగళవారం గణేశ్ ఇరుముడులు సమర్పించారు. ఆలయ పరిసర గ్రామస్తులు 60 మంది స్వామి దీక్ష తీసుకుని, మంగళవారం విరమించారు. వీరికి ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో పెంచలకిషోర్, దేవదాయశాఖ విశ్రాంత ఏడీసీ కేశవులు, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూదన్‌రావు దగ్గరుండి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు.


ఇరుముడులు తీసుకొచ్చిన భక్తులతో ఆలయ ఈవో పెంచలకిషోర్

భక్తులకు ప్రసాద పంపిణీ

కాణిపాకంలో జరుగుతున్న వరసిద్ధుడి ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా తెప్పోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయం వద్ద ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా భక్తులకు మంగళవారం ప్రసాద పంపిణీ జరిగింది. భక్తులకు ప్రసాదాన్ని ఈవో పెంచలకిషోర్, మాజీ సర్పంచ్ మధుసూదన్ రావు, మల్లికార్జున్ అందజేశారు.

ఆల్‌రౌండర్..!

● అటెండర్, ఫార్మసిస్ట్ పోస్టులు ఖాళీ
● వీరి విధులనూ నిర్వహిస్తున్న డాక్టర్
● తరచూ ఇబ్బంది పడుతున్న రోగులు
● సిద్దేశ్వరకొండ హోమియోపతి ఆస్పత్రిలో ఇదీ పరిస్థితి


ప్రహరీ లేని ఆస్పత్రి భవనం

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సిద్దేశ్వరకొండ హోమియోపతి ఆస్పత్రిలోని డాక్టరే ఆల్‌రౌండర్‌గా పనిచేయాల్సి వస్తోంది. అటెండర్ పోస్ట్ ఎనిమిదేళ్లుగా, ఫార్మసిస్ట్ పోస్ట్ రెండేళ్లుగా ఖాళీగా ఉంది. ఈ ఏడాది జనవరిలో ఈ ఆస్పత్రికి కొత్త డాక్టర్‌గా అస్మ అంజుమ్ నియమితులయ్యారు. ఈమె వచ్చాక ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య క్రమేపీ పెరిగింది. అటెండర్, ఫార్మసిస్ట్ పోస్టులు ఖాళీగా ఉండటంతో వారి విధులనూ డాక్టరే నిర్వహించాల్సి వస్తోంది. దీనివల్ల ఆమె గ్రామాల్లో క్యాంపులు నిర్వహించేటప్పుడు, జిల్లా కేంద్రంలో ఉన్నతాధికారులు మీటింగ్‌లకు వెళ్లినప్పుడు ఆస్పత్రి మూత వేయాల్సి వస్తోంది. దీనివల్ల తరచూ రోగులు ఇబ్బంది పడుతున్నారు.

చీకటిపడితే మందుబాబులకు నిలయంగా..

ఆస్పత్రికి ప్రహరీ లేకపోవడంతో చీకటిపడితే మందుబాబులకు నిలయంగా మారుతోంది. మరోవైపు చుట్టుపక్కల వారు సైతం ఆస్పత్రి స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారు. విద్యుత్ సౌకర్యం కూడా కొంతకాలంగా లేకుండా పోయింది. ఇకనైనా ఉన్నతాధికారులు చొరవ చూపి ఈ ఆస్పత్రిలోని సమస్యలను పరిష్కరించాలని రోగులు కోరుతున్నారు.


వృద్ధుడి సమస్యను తెలుసుకుంటున్న డాక్టర్ అస్మ అంజుమ్

ఎమ్మెల్యేకు సన్మానం



చిత్తూరు సిటీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను మాపాక్షి గ్రామస్తులు సన్మానించారు. మాపాక్షికి చెందిన ఝాన్సీ వెంకటేష్ యాదవ్‌కు చిత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ పదవి ఇవ్వడంపై ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం లక్ష్మీనగర్‌కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ బాబు, డివిజన్ ఇన్‌చార్జి దేవేంద్ర, నేతలు రాధాకృష్ణ, బాబు, మురగేష్ తదితరులు పాల్గొన్నారు.

నిండ్రలో నేడు, రేపు క్రీడా పోటీలు

నిండ్ర, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధ, గురువారాల్లో మండల స్థాయి క్రీడాపోటీలు నిండ్ర జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతాయని ఎంఈవోలు వసుమతి దేవి, శ్రీధర్‌రాజు తెలిపారు. బుధవారం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, చెస్, యోగా పోటీలు జరుగుతాయన్నారు. గురువారం అథ్లెటిక్స్ ఉంటాయన్నారు. అండర్-17 బాల బాలికలు 2009 జనవరి ఒకటో తేదీ తర్వాత జన్మించి ఉండాలని, ఆరో తరగతి నుంచి ఇంటర్ చదువుతున్నవారు అర్హులన్నారు. అండర్-14 బాల బాలికలు 2012 జనవరి ఒకటో తేదీ తర్వాత జన్మించి 6వ తరగతి చదువుతున్న వారు అర్హులన్నారు. పూర్తి వివరాలకు శ్రీనివాసులు (హెచ్ఎం), జ్ఞానకుమార్ (క్రీడల కో-ఆర్డినేటర్)ను సంప్రదించాలన్నారు.

మంత్రిని కలిసిన తెలుగు యువత



గంగాధర నెల్లూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను జిల్లా తెలుగుయువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దేవపత్ని ధనంజయనాయుడు మంగళవారం విజయవాడలోని స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతోపాటు తెలుగుయువత మండల అధ్యక్షుడు దేవపత్ని కిరణ్‌నాయుడు, నేతలు ప్రసాద్‌నాయుడు, నవీన్ ఉన్నారు.

ఓజోన్ పొరను రక్షించుకుందాం


విద్యార్థులతో మొక్కలు నాటిస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

నిండ్ర, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఓజోన్ పొరను రక్షించుకుందామని నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ పిలుపునిచ్చారు. మంగళవారం అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినం సందర్భంగా ఎకో క్లబ్ ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం కళాశాల ఆవరణలో విద్యార్థులతో మొక్కలు నాటించారు. వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే నెత్తంకండ్రిగ జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం ఉమాశంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జోరుగా వరినాట్లు



గంగాధర నెల్లూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లోని రైతులు జోరుగా వరినాట్లు వేస్తున్నారు. తూగుండ్రం, కొత్త వెంకటాపురం, పాతవెంకటాపురం చెరువులు నిండి మొరవ పారాయి. దీనివల్ల మండలంలోని పలువురు రైతులకు చెందిన వ్యవసాయ, బోరు బావుల్లో నీటి మట్టం పెరిగింది. కొందరు వరినాట్లు వేయగా, మరికొందరు పొలాలను సాగుకు సిద్ధం చేస్తున్నారు. దీనిపై మండల వ్యవసాయాధికారి భవాని మాట్లాడుతూ.. ఈనెలాఖరుకు 250 ఎకరాల్లో వరిసాగు చేస్తారని తెలిపారు.

విద్యార్థులకు సన్మానం



శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం డైట్‌లో జరిగిన కళా ఉత్సవ్ పోటీల్లో 49.కొత్తపల్లెమిట్ట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని హెచ్ఎం శాంతి తెలిపారు. ప్రతిభ చూపిన వారిలో.. భవన్, జాయలుకాస్, నాగేంద్రబాబు, ఎ.నాని, సుమన్, పూర్ణిమ, హైస్కూల్ ప్లస్ విద్యార్థినులు ఉమ, లీమా, భువనేశ్వరి ఉన్నారన్నారు. వ్యక్తిగత పోటీల్లో డప్పు వాయించడంలో పదో తరగతి విద్యార్థి పి.ప్రవీణ్ కుమార్ రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీలకు ఎంపికయ్యాడని చెప్పారు. వీరిని మంగళవారం పాఠశాలలో అభినందించారు. టీచర్లు రెడ్డెప్పనాయుడు, హేమలత, శ్రీనివాసులు, గోవర్ధన రెడ్డి, ఉమాపతి, ధనంజయులు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడి పాలక మండలి ప్రమాణ స్వీకారం



వెదురుకుప్పం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పాలక మండలి కమిటీ నూతన ఛైర్మన్‌గా కార్వేటినగరంకు చెందిన రామిశెట్టి రాజశేఖర్ మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పాలక మండలి సభ్యులుగా గోవిందస్వామి, రాధాకృష్ణ, వినయ్, తులసి, సెల్వి, అమరావతి కూడా ప్రమాణస్వీకారం చేశారు. ఆలయ ఈవో కృష్ణనాయక్, ఇన్‌స్పెక్టరు వినోద్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి యుగంధర్, టీడీపీ కార్వేటినగరం మండల అధ్యక్షుడు చెంగల్రాయయాదవ్, కూటమి నాయకులు హాజరయ్యారు.

తమిళనాడులో గెలిచేది మేమే..!

● అన్నాడీఎంకే రాష్ట్ర కార్యదర్శి వలర్మతి

నిండ్ర, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేది తామేనని అన్నాడీఎంకే రాష్ట్ర కార్యదర్శి వలర్మతి జోస్యం చెప్పారు. తమిళనాడు మాజీ సీఎం అన్నాదొరై జయంతి సందర్భంగా పార్టీ ఏపీ రాష్ట్ర కార్యదర్శి ఆంబ్రోస్ విల్సన్ నగరి బస్టాండ్ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన భారీ అన్న, వస్త్రదాన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. నాయకులు రత్నం, బృందా, తవమణి ఆశీర్వాదం, రవూఫ్, రఘు, జహంగీర్, పెరియస్వామి, మునియమ్మ, చంద్రన్, వేణు తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ చేయిస్తే కఠిన శిక్షలు

డీఎల్ఎస్ఏ సెక్రటరీ భారతి హెచ్చరిక


'జీవన జ్వాల' ఫ్లెక్సీతో డీఎల్ఎస్ఏ సెక్రటరీ భారతి

నిండ్ర, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వెట్టి చాకిరీ చేయిస్తే కఠిన శిక్షలు ఉంటాయని డీఎల్ఎస్ఏ (జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ) సెక్రటరీ భారతి హెచ్చరించారు. జీవన జ్వాల ప్రతినిధులు మంగళవారం నగరి మున్సిపల్ పరిధి కీళపట్టు ఎస్ఎస్ఎన్ ఫంక్షన్ హాలులో విముక్తిపొందిన సుమారు 400 మంది కార్మికులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. మూఢనమ్మకాలను విడనాడి ధైర్యంగా బతకాలని పిలుపునిచ్చారు. నగరి ఆర్డీవో అనుపమ మాట్లాడుతూ.. కార్మికులకు ప్రభుత్వం నుంచి మద్దతు ఉంటుందన్నారు. డీఎస్పీ అజీజ్ మాట్లాడుతూ.. కార్మికులకు తమశాఖ తరఫున సాయం చేయడానికి సిద్ధంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో జీవన జ్వాల సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నేడు ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం మధ్యాహ్నం భోజన విరామంలో ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నాయకులు తెలిపారు. మంగళవారం కూడా నల్లబ్యాడ్జీలతో విధులు హాజరయ్యామన్నారు. జేఏసీ నాయకులు చంద్రమౌళి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దారి సమస్యకు పరిష్కారం

పాలసముద్రం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దిగువ వనదుర్గాపురంలోని శ్మశాన వాటికకు దారి సమస్య తలెత్తిందని స్థానికుల ఫిర్యాదుతో మంగళవారం తహసీల్దార్ అరుణ కుమారి గ్రామానికి వచ్చారు. గ్రామస్తులతో మాట్లాడి దారి సమస్యను పరిష్కరించారు. ఆర్ఐ శ్రీదేవి, వీఆర్వోలు వెంకటాచలం, శ్రీనివాసులు, రమేష్ నాయుడు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి, బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని వృద్ధులకు బీజేపీ నాయకులు మంగళవారం పండ్లు పంపిణీ చేశారు. 28వ డివిజన్‌లోని రాష్ట్రీయ సేవా సమితి వికాస్ విహార్‌లోని వృద్ధులకు, దివ్యాంగులకు నిర్వాహకుడు ముత్యాలశెట్టితో కలిసి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి శ్రీనివాసన్, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఓంకార్, షణ్ముగం, ప్రసాద్ పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 20 మంది ఎంపిక



తవణంపల్లె, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అరగొండ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో చెన్నైకి చెందిన మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, శంకర నేత్రాలయ ఆస్పత్రి ఆధ్వర్యంలో నేత్రవైద్య ఉచిత శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మందికి వైద్యపరీక్షలు చేయగా, 20 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు సంస్థ కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ తెలిపారు. వీరికి చెన్నై శంకర నేత్రాలయ ఆస్పత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు చెప్పారు.

'బొజ్జ గణపయ్య'కు పూజలు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వన్నియర్ బ్లాక్‌లో స్థానిక యువత నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాలకు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మంగళవారం హాజరయ్యారు. బొజ్జ గణపయ్య ప్రతిమకు పూజలు చేశారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

పాలసముద్రం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని పాలసముద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం మీనాక్షి పిలుపునిచ్చారు. మంగళవారం ఓజోన్ పొరపై ప్రజలకు విద్యార్థులతో కలిసి అవగాహన కల్పించారు. పాఠశాల నుంచి పాలసముద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. టీచర్లు ధనరాజ్, దామోదర్ రెడ్డి, సువర్ణ, మల్లేశ్వరి, జమున పాల్గొన్నారు.

ఉపాధి శ్రామికులంతా ఈకేవైసీ చేయించుకోవాలి

పాలసముద్రం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద పనిచేసే శ్రామికులంతా ఈకేవైసీ చేయించుకోవాలని ఏపీవో మార్గరెట్ సూచించారు. మండలంలో 6361 జాబ్ కార్డులు ఉన్నాయని, ప్రభుత్వ ఆదేశాలతో ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా ఈకేవైసీ చేయిస్తున్నామని తెలిపారు. పనుల్లో జరుగుతున్న అక్రమాలను అరికట్టడంలో భాగంగా మన రాష్ట్రంలోని కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో అక్టోబరు ఒకటో తేదీనుంచి నూతన విధానాన్ని ప్రయోగాత్మకంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు.